ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
కర్ణాటక వార్తలు
గురువారం 6 మార్చి 2025



అడుగు ముందుకేయని... బ్రాండ్ బెంగళూరు..!

శాసనసభకు గ్రేటర్ బెంగళూరు బిల్లు



బీబీఎంపీ కేంద్ర కార్యాలయం

సభలో బ్రాండ్ బెంగళూరు బిల్లుపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్

- పౌరకార్మికులకు పురస్కారాలు ఎక్కడ..?
- ఆచూకీలేని ఆరోగ్య కమిషనరేట్
- అవే రుచులు.. పెరగని ఇందిరా క్యాంటిన్లు

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం అంటే జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పేరొందుతోందని, అయితే నగరాన్ని వెంటాడుతున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి మరో రెండు మూడు దశాబ్దాలపాటు ఆధునిక బెంగళూరుగా మారిందనే రీతిలో 'బ్రాండ్ బెంగళూరు'ను తీర్చాలనే నిర్ణయం అడుగు ముందుకేయని రీతిలో స్తంభించింది. బ్రాండ్ బెంగళూరు పరికల్పనతో నగరానికి కొత్త రూపు తీసుకురావాలని బీబీఎంపీ 2024-25 బడ్జెట్‌లో ప్రవేశపెట్టారు. ఇందుకోసం రూ.1,580 కోట్లు ఖర్చు చేయదలిచారు. మరికొన్ని రోజుల్లోనే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అయితే బ్రాండ్ బెంగళూరు లక్ష్యంగా నిర్ణయించిన ప్రగతికి నోచుకోలేదు.

● బ్రాండ్ బెంగళూరులో ఆకలితో ఎవరూ అలమటించరాదని, పౌష్ఠికాహారం సమకూర్చాలని ప్రస్తుతం కొనసాగుతున్న తక్కువధరకే టిఫిన్, భోజనం అందిస్తున్న ఇందిరా క్యాంటీన్‌లకు అదనంగా 50 ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇంటి ముంగిటకే ఆరోగ్యసేవలు అందించే ఆరోగ్యసారథి, మహిళలకోసం ప్రత్యేకంగా షి టాయ్‌లెట్‌లతోపాటు హసిరు బెంగళూరు, టెక్ బెంగళూరు, స్వచ్ఛ బెంగళూరు, ఆకర్షక బెంగళూరు వంటి పేర్లతో పథకాలు అమలు చేయదలిచారు. అయితే ఏ విధమైన పథకాలు కూడా ప్రారంభానికి నోచుకోలేదు. కానీ పలు మార్లు బ్రాండ్ బెంగళూరు సదస్సులు నిర్వహించి పలు రంగాల ప్రముఖులను, విద్యార్థులను, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చాగోష్ఠులు నిర్వహించారు. బ్రాండ్ బెంగళూరు డీసీఎం, బెంగళూరు అభివృద్ధిశాఖ మంత్రి డీకే శివకుమార్ ఆలోచనలో ఏర్పడింది. ఇందుకోసం 7 విభాగాలలో బీబీఎంపీ ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. బ్రాండ్ బెంగళూరు కోసం ఎస్క్రోకు అనుకున్న లక్ష్యమైన రూ.1580 కోట్లు కేటాయిస్తామన్నారు. ప్రీమియం ఎఫ్ఏఆర్‌కు ఫిబ్రవరి 21న ఆర్డినెన్స్ జారీ చేశారు.

2024-25లో బీబీఎంపీ రూ.12,371.63 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టింది.

పబ్లిక్ వర్క్స్	7280.93 కోట్లు
చెత్త నిర్వహణకు	1952.19 కోట్లు
సాంఘిక సంక్షేమశాఖకు	829.63 కోట్లు
వైద్య ఆరోగ్య విభాగానికి	483.26 కోట్లు
ఉద్యానవన విభాగానికి	248.08 కోట్లు
విద్యావిభాగానికి	214.82 కోట్లు
నగర యోజన	62.30 కోట్లు

ఖర్చు చేయదలిచారు.

బ్రాండ్ బెంగళూరుకు రూ.1,580 కోట్లు ఖర్చు చేయాలని తీర్మానించారు. ఇందులో ట్రాఫిక్, రవాణా కోసం రూ.880 కోట్లు, ఆకర్షణ బెంగళూరుకు 225 కోట్లు, స్వచ్ఛ బెంగళూరుకు 150 కోట్లు, ఆరోగ్యకర బెంగళూరుకు రూ.125 కోట్లు, గ్రీన్ బెంగళూరుకు రూ.100కోట్లు, టెక్ బెంగళూరుకు రూ.50కోట్లు, ఎడ్యుకేషన్ బెంగళూరుకు రూ.50కోట్లు ఖర్చు చేయదలిచారు.

ప్రారంభం కాని ఇందిరా క్యాంటిన్‌లు

సీఎం సిద్దరామయ్య గత ప్రభుత్వంలో ప్రారంభించిన ఇందిరాక్యాంటీన్‌ల వలన సామాన్య ప్రజలకు అనుకూలంగా ఉందనే మంచిపేరు వచ్చింది. గత ఏడాది ప్రభుత్వం ఏర్పడినప్పుడు కొత్తగా 50 క్యాంటీన్‌లు ఏర్పాటు చేయదలిచారు. కానీ కొన్నేళ్లుగా పని చేస్తున్న ఇందిరాక్యాంటీన్‌లు అస్తవ్యస్తంగా మారాయి. ఇక చెత్త నిర్వహణ అధ్వానంగా మారి నగరమంతటా చెత్త సమస్య పునరావృతమైంది.

ఆచూకీలేని ఆరోగ్య కమిషనరేట్

ఆరోగ్యవంతమైన బెంగళూరుకోసం రూ.125కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. బెంగళూరు కోసమే ప్రత్యేకమైన హెల్త్ కమిషనరేట్ ప్రారంభించాలని భావించారు. కానీ ఏడాది ముగుస్తున్నా కమిషనరేట్ ఆచూకీ లేదు. ఆరోగ్య సారథి, మనోబింబ, సదృఢ ఆరోగ్య వంటి పేర్లతో పథకాలు అమలు చేయదలిచినా సాధ్యం కాలేదు. టెక్ బెంగళూరు పరికల్పనలో పౌర సేవలు అభివృద్ధి చేయదలిచారు. రోడ్లపై గుంతలు పూడ్చాలని భావించారు. కానీ వర్షాలు నిలిచి నెలలు ముగుస్తున్నా ఇప్పటివరకు గుంతలు మాత్రం యథావిధిగానే ఉన్నాయి.

● ఇక స్వచ్ఛబెంగళూరు కోసం చెత్త నిర్వహణకు నగరానికి నాలుగువైపులా వంద ఎకరాల చొప్పున కొనుగోలుకు రూ.100కోట్లు రిజర్వు చేశారు కానీ కొనుగోలు చేయలేదు. ప్రతి డివిజన్ లోనూ ఓ పౌరకార్మికుడికి శరణ సత్యక్క పురస్కారం పేరిట రూ.50వేల నగదు ప్రోత్సాహం కెంపేగౌడ జయంతిన ఇవ్వదలిచారు. కానీ అమలు చేయలేదు.

శాసనసభకు గ్రేటర్ బెంగళూరు బిల్లు

బెంగళూరు నగరాన్ని అభివృద్ధి చేసేందుకు పాలనలో మెరుగు పాటించాలని భావించారు. ఇందుకోసం శాసనసభ కమిటీ రూపొందించిన గ్రేటర్ బెంగళూరు పాలనా బిల్లును శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టారు. శాసనసభా కమిటీ చైర్మన్ రిజ్వాన్ అర్షద్ బిల్లును తీసుకొచ్చారు. 2025లో కోటిన్నరమంది ఉన్న బెంగళూరు జనాభాకు అనుగుణంగా పాలనా సౌకర్యాలు సమకూర్చేందుకు విభజించాలని సూచించారు. ప్రతి నగర పాలికెకు 100-200 వార్డుల చొప్పున కేటాయించి విభజించాలని ప్రస్తావించారు. బిల్లుపై చర్చలో ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

అర్చకుల వేతన తారతమ్యాలపై కమిటీ ఏర్పాటు



బదులిస్తున్న మంత్రి రామలింగారెడ్డి

బెంగళూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అర్చకుల వేతన వ్యత్యాసాలపై మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఓ కమిటీ ఏర్పాటు చేస్తామని దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. బీజేపీ సభ్యుడు ప్రతాప్‌సింహనాయక్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అర్చకులకు వేతనాల విషయంలో సమన్వయం పాటిస్తామన్నారు.


26 లక్షల నకిలీ లేబర్ కార్డులు రద్దు



వివరణ ఇస్తున్న మంత్రి సంతోష్‌లాడ్

రాష్ట్రంలో 56 లక్షల భవన నిర్మాణ కార్మికుల కార్డులను పరిశీలించామని అందులో 26 లక్షల కార్డులు నకిలీవిగా గుర్తించి రద్దు చేశామని కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్ తెలిపారు. సభ్యుడు మహేశ్ తెంగినకాయ అడిగిన ప్రశ్నకు మంత్రి వివరణ ఇచ్చారు. 2022 నుంచి ఇప్పటివరకు పెళ్లి సాయం కోసం 1,57,174 దరఖాస్తులు వచ్చాయని, 1.06 లక్షల అర్జీదారులకు సాయం చేశామన్నారు. గంగా కల్యాణ పథకం లక్ష్యాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి మహదేవప్ప తెలిపారు. శాసనసభలో సభ్యులు సునిల్‌కుమార్, చంద్రు లమాణి అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి మాట్లాడుతూ బోరుబావుల తవ్వకం టార్గెట్‌లను పెంచి అవసరమైన రైతులను ఆదుకుంటామన్నారు.

ప్రగతిపథలో 7,110 కి.మీ. అభివృద్ధి



సభలో మంత్రి ప్రియాంక ఖర్గే

పీఎంజీఎస్‌వై నిబంధనలు సరళీకృతం చేయకపోవడంతో ప్రగతిపథ, కల్యాణపథ పేరిట రాష్ట్ర ప్రభుత్వం 7,110 కి.మీ రోడ్లను అభివృద్ధి చేయదలిచిందని మంత్రి ప్రియాంక ఖర్గే వెల్లడించారు. ఇందుకు 5,190 కోట్ల రూపాయల గ్రాంటు విడుదల చేశామన్నారు. 10శాతం రైతుల భూములకు వెళ్లేందుకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

ప్రభుత్వం ఇళ్లు నిర్మించడం సాధ్యంకాదు

- మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్

ప్రభుత్వం నేరుగా ఇళ్లను నిర్మించడం సాధ్యంకాదని వసతి శాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బీజేపీ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ప్రస్తుతం ఇంటిని నిర్మించాలంటే రూ.7.5లక్షలు ఖర్చు అవుతుందని, ప్రభుత్వం అందిస్తున్న గ్రాంట్లతో నిర్మాణాలు పూర్తి కావన్నారు. అందుకే టార్గెట్‌లు సాధ్యం కావడం లేదన్నారు. నేరుగా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేపట్టడం సాధ్యం కాదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. రాయచూరులో విద్యార్థులు ప్రయాణించేందుకు బస్సు సమస్య తీవ్రంగా ఉందని సభ్యుడు వసంతకుమార్ ప్రస్తావించారు. రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి సమాధానమిస్తూ కల్యాణ కర్ణాటకకు 156 కొత్త బస్సులు కేటాయించామన్నారు. 50 కల్యాణరథ బస్సులు వస్తాయని అందులో ఏసీ సర్వీసులు కూడా ఉంటాయన్నారు. రాయచూరు నగరంలో తిరిగేందుకు 18 బస్సులు కేటాయిస్తామన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.45	5.21
గురువారం సాయంత్రం	శుక్రవారం ఉదయం

మాజీ స్పీకర్‌కు బిగ్ రిలీఫ్

- అటవీ భూముల ఆక్రమణ కేసు కొట్టివేత
- నేను తప్పు చేయలేదు: రమేశ్‌కుమార్



బెంగళూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లా శ్రీనివాసపుర పరిధిలో అటవీభూముల ఆక్రమణలకు పాల్పడ్డారనే కేసులో మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్‌కు బిగ్ రిలీఫ్ లభించింది. ఆయనపై న్యాయవాది శివారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం బుధవారం కొట్టివేసింది. శ్రీనివాసపురం తాలూకా జినగలకుంటె గ్రామ సర్వే నెంబరు-1, 2లలో అటవీభూములను ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి నాలుగుసార్లు సర్వే జరిగింది. సుదీర్ఘ విచారణల తర్వాత హైకోర్టు న్యాయమూర్తి ఎం నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. ఇదే విషయమై రమేశ్‌కుమార్ కోలారులో మీడియాతో మాట్లాడుతూ.. చౌడేశ్వరీదేవి సాక్షిగా నేను తప్పు చేయలేదన్నారు. ఏళ్ల తరబడి తనపై ఆరోపణలు వచ్చాయన్నారు. ఇంతవరకు సాగింది కేవలం ట్రయల్స్ మాత్రమేనని, ఇకపై అసలు సినిమా ఉంటుందన్నారు. శ్రీనివాసపురం అభివృద్ధికి సహకరిస్తానని, ఆరోపణల గురించి పట్టించుకోనన్నారు.



నిరసనలో ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, పార్టీ శ్రేణులు

ఎస్సీ, ఎస్టీ నిధుల మళ్లింపుపై నిరసన

బెంగళూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ నిధులను వేర్వేరు పథకాలకు మళ్లించడంపై బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. షెడ్యూల్డు కులాలు, తరగతుల సంక్షేమానికి ఉద్దేశించిన నిధులు సద్వినియోగం చేయకపోవడంపై ప్రతిపక్షనేత ఆర్ అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఫ్రీడం పార్కులో ఏర్పాటైన నిరసనలో ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ గ్యారెంటీ పథకాల పేరిట వివిధ సంక్షేమపథకాలకు ఉద్దేశించిన నిధులను మళ్లించారని ఆరోపించారు. పాలకులు అభివృద్ధిని పట్టించుకోలేదని, ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిందని విమర్శించారు. నిరసనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, పరిషత్ ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామి, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపి ఉన్న లారీని ఢీకొన్న లారీలు

- ముగ్గురి దుర్మరణం
- మృతుల్లో ఒకరు తాడిపత్రి వాసి



నుజ్జునుజ్జయిన లారీలు... చెల్లాచెదురైన కళింగర పండ్లు

బళ్లారి గాంధీనగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ తాలూకా పరిధిలోని సీబార వద్ద జాతీయ రహదారి48పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన ఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన నిలబడిన లారీని వెనుక నుంచి రెండు లారీలు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన శేఖర్(55), ధర్మపురి పేరియస్వామి(50), ఉత్తరప్రదేశ్ లిగడదకు చెందిన జబురుద్దీన్(55)గా పోలీసులు గుర్తించారు. ముంబై నుంచి బెంగళూరు వైపువెళుతున్న సమయంలో రెండు లారీలు నిలబడి ఉన్న మరో లారీని ఢీకొన్నాయి. బట్టలు తీసుకెళుతున్న లారీ టైర్ పేలిపోవడంతో రోడ్డు పక్కన నిలిపి ఉన్న సమయంలో వెనుక నుంచి లారీ ఢీకొంది. ఇదే క్రమంలో వెనుకనే కళింగర పండ్ల లోడుతో వస్తున్న లారీ వరి బస్తాల లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో మూడు లారీల డ్రైవర్లు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ప్రమాదం ధాటికి రోడ్డుపై బట్టలు, వరిధాన్యం, కళింగర కాయలు చెల్లాచెదరుగా పడిపోయాయి. దీంతో జాతీయ రహదారిపై రాకపోకలు ఆగిపోయాయి. మృతదేహాలను చిత్రదుర్గ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై పడినవాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. చిత్రదుర్గ జిల్లా గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



జోడు రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా జోడు రథోత్సవం

కంప్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు వేదవతి నది ఒడ్డున వెలసిన సిద్దేశ్వర, గాదిలింగప్ప తాతల జోడు రథోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఏటా ఈ రథోత్సవాలను ఆంధ్ర, కర్ణాటక ప్రజలు కన్నుల పండువగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం ముత్తయిదువ లు కలశాలతో ఊరేగింపుగా విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటిలో ఒడినింపే కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం గాదిలింగప్ప తాత ఆలయం ఎదురు బసవన్న కట్ట వరకు జోడు రథాన్ని ఊరేగించారు. లక్షలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పాదయాత్రగా వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు మజ్జిగ, అన్నప్రసాదాలు అందించారు.



కలశాలతో ఆలయానికి వస్తున్న మహిళలు


మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని రాసిన వైట్‌బోర్డు వాహనం

ఇంజనీర్ల కక్కుర్తి

హెచ్చెల్సీ డివిజన్‌లో ఉంచిన అద్దె కార్లు



జలవనరుల శాఖలో అద్దె వాహనాల గోల్‌మాల్

- నిబంధనలకు విరుద్ధంగా వైట్ బోర్డు వాహనాల వినియోగం
- బిల్లు మాత్రం ఎల్లోబోర్డు వాహనాల పేరిట డ్రా
- ఏటా రూ.కోట్ల నిధులు స్వాహా
- బదిలీపై వెళ్లిన ఈఈపై విచారణ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో అద్దె వాహనాల పేరుతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం, హెచ్చెల్సీ, మైనర్ ఇరిగేషన్‌లో ఇదే తంతు సాగుతోంది. ఏకంగా ఓ ఇంజనీరు నాలుగు పోస్టుల్లో పనిచేస్తూ రెండు వాహనాలకు బిల్లులు డ్రా చేసుకుంటున్నారు. మరో ఇంజనీరు గతంలో హెచ్చెల్సీలో పని చేసి సుమారు రూ.30లక్షలు అద్దె వాహనాల పేరుతో డ్రా చేయడంపై నేటికీ విచారణ సాగుతోంది. తాజాగా ఆ ఇంజనీరు నంద్యాల నుంచి జిల్లాకు వచ్చి జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ వద్ద విచారణకు హాజరైనట్లు సమాచారం. హంద్రీనీవాలో ఇన్‌చార్జి ఈఈలుగా ఉన్న డీఈలు ఇదే తరహాలో అద్దె వాహనాల పేరుతో బిల్లులు చేసుకుంటున్నారనే చర్చ ఆ శాఖలో జోరుగా సాగుతోంది. హెచ్చెల్సీలో ఓ డివిజన్‌కు ఇన్‌చార్జి ఈఈగా పనిచేస్తున్న డీఈ ఆ డివిజన్ వైపు నెలకు ఒక్కసారైనా తొంగి చూడకపోవడం అటుంచితే... ప్రతినెలా వెహికల్ అద్దె బిల్లులు మాత్రం సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం నిరుద్యోగిగా ఉండే ఒక ఎల్లోబోర్డు వాహనం కలిగిన డ్రైవర్‌కు ఉపాధి కల్పించేలా అద్దె వాహనాలను తీసుకోవాలి. జలవనరుల శాఖలో ఇందుకు విరుద్ధంగా ఇంజనీర్లు సొంత వైట్‌బోర్డు కలిగిన వాహనాల్లో తిరుగుతూ అద్దె కోసం బినామీ ఎల్లో బోర్డు వాహనాలను నమోదు చేస్తున్నారు. ఇక మైనర్ ఇరిగేషన్ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జలవనరుల శాఖలో ఏటా అద్దె వాహనాల పేరుతో రూ.కోట్లాది నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి.


మైనర్ ఇరిగేషన్ కార్యాలయం

ఆయన రూటే వేరు...

జలవనరుల శాఖలో ఆయన రూటే వేరుగా నడుస్తోంది. ఆరోగ్య సమస్యల పేరుతో ఆఫీస్ నుంచి బయటకు కదలరు...వాహనం తీయరు... బిల్లు మాత్రం ప్రతి నెలా ఎంచక్కా డ్రా చేసుకుంటారు. ఒకటి కాదు... రెండు కాదు ఏకంగా ఐదు పోస్టులలో ఆ ఇంజనీరు పనిచేస్తున్నారు. రెండు పోస్టులకు సంబంధించి వెహికల్ బిల్లు డ్రా చేస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో డిప్యూటీ సీఈగా, హెచ్చెల్సీ ఐ డివిజన్ ఈఈగా, హెచ్చెల్సీ డిప్యూటీ ఎస్‌ఈగా, డీబీసీ డివిజన్ ఈఈగా పనిచేస్తున్నారు. ఇందులో ఐ డివిజన్, డీబీసీ డివిజన్లకు సంబంధించి ప్రతినెలా అద్దె వాహనాలకు సంబంధించి బిల్లులు చేసుకుంటున్నారు. బిల్లులు పెట్టకపోతే 'మీ కథ చూస్తా నంటూ...' కిందిస్థాయి ఉద్యోగులపై చిందులేస్తున్నట్లు సమాచారం. తనకు ఆరోగ్యం సరిగా లేదనే సాకుతో ఉద్యోగులపై పెత్తనం చేస్తూ బిల్లులు స్వాహా చేస్తున్నారు.



బదిలీపై వెళ్లిన ఇంజనీరుపై విచారణ

హెచ్చెల్సీ పరిధిలోని ధర్మవరం డివిజన్ బ్రాంచ్ కెనాల్ ఈఈగా పనిచేసిన అధికారిపై వాహనాల బోగస్ బిల్లులు డ్రా చేసిన ఆరోపణలపై విచారణ సాగుతోంది. 2020, 2021 సంవత్సరాల్లో డీబీసీ డివిజన్‌లో ఈఈగా పనిచేసిన శుభకుమార్ నంద్యాలకు బదిలీలపై వెళ్లారు. ఆయన పనిచేసిన సమయంలో సుమారు రూ.30లక్షలు అద్దె వాహనంలో తప్పుడు బిల్లులతో నిధులు డ్రా చేసుకున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో... అప్పటి నుంచి విచారణ సాగుతోంది. తాజాగా జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ సీఈ వద్దకు వచ్చి శుభకుమార్ విచారణకు హాజరైనట్లు సమాచారం. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈఈ శుభకుమార్ అనేక ప్రయత్నాలతో పాటు గతంలో ఉన్నత స్థానాల్లో పనిచేసిన అధికారుల నుంచి ఒత్తిడి చేయిస్తున్నట్లు తెలిసింది. ఆ కేసు నుంచి ఈఈ శుభకుమార్‌కు విముక్తి కల్పించేందుకు విచారణ చేస్తున్న అధికారులు ఏమాత్రం అంగీకరించడం లేదనేది ఆ శాఖలో చర్చ సాగుతోంది.

20మందికిపైగా వాహన సదుపాయం

జలవనరుల శాఖలో కీలకంగా హెచ్చెల్సీ ఎస్‌ఈ, డిప్యూటీ ఎస్‌ఈ, ఈఈలు, డీఈలు, ఏఈలు ఉన్నారు. వీరిలో ఎస్‌ఈ, ఈఈలు, డీఈలకు వాహన సదుపాయం ఉంది. సొంత వాహనాలు వాడరాదనీ, పైగా బినామీ, కుటుంబ సభ్యుల పేరుతో కూడా ఉండరాదనీ, నిరుద్యోగులైన డ్రైవర్లకు అద్దె వాహనం పెట్టుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వం ప్రత్యేకంగా నిబంధన విధించింది. నిబంధనలకు తూట్లు పొడుస్తూ హెచ్చెల్సీ పరిధిలోని ఓ డీఈ... అదే శాఖలోని ఓ డివిజన్‌కు ఇన్‌చార్జి ఈఈగా పనిచేస్తూ క్షేత్రస్థాయిలోకి వెళ్లకుండానే వెళ్లినట్లు వాహనాలకు బిల్లులు చేసుకుని స్వాహా చేస్తున్నారు. ఇన్‌చార్జి ఈఈగా ఉన్నా.. డివిజన్‌కు నెలలో ఒక్కసారి కూడా వెళ్లిన పాపాన పోలేదు. బిల్లులు మాత్రం ప్రతినెలా క్షేత్రస్థాయిలోకి వెళ్లినట్లు డ్రా చేసుకుని తన ఖాతాలోకి వేసుకుంటున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. అయినా ఆ ఇంజనీరు ఏమాత్రం లెక్కచేయకుండా అద్దె వాహనాల పేరుతో బిల్లులు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోనే ఉంటున్న డీఈలు ఏసీ ఆఫీస్‌లో కూర్చుని అద్దె వెహికల్‌కు బిల్లులు చేసుకుంటున్నారు.

హంద్రీనీవాలోనూ అదే తంతు

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం జలవనరుల శాఖలో మరో కీలకమైన విభాగం. ఇందులో కూడా ఐదు డివిజన్లు ఉన్నాయి. వాటికి ఐదుగురు ఈఈలు, ఒక్కో డివిజన్‌లో సుమారు నలుగురు డీఈల చొప్పున 20మందికి పైగా ఉన్నారు. వీరిలో సగానికి పైగా ఇంజనీర్లు సొంత వాహనాల్లో వైట్‌బోర్డుతో తిరుగుతూ అద్దె కోసం ఎల్లో బోర్డు వెహికల్ నంబరు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఐదు డివిజన్లలో నాలుగు డివిజన్లకు ఇన్‌చార్జి ఈఈలే ఉన్నారు. హంద్రీనీవాలో ఇన్‌చార్జి ఈఈలుగా ఉన్న డీఈలు రెండేసి వాహనాలకు ఒక వైట్, ఒకటి ఎల్లో బోర్డుతో బిల్లులు డ్రా చేసుకుంటున్నారు. ఇక్కడ అడిగే నాథుడే కరువయ్యాడు.


జలవనరుల శాఖ కార్యాలయం

మైనర్ ఇరిగేషన్‌లో వైట్‌బోర్డు వెహికల్

మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉమ్మడి జిల్లాలో ముగ్గురు ఈఈలు, 12 మంది డీఈలు ఉన్నారు. ఈఈ పోస్టుల్లో ఇన్‌చార్జిలుగా డీఈలు పనిచేస్తున్నారు. ధర్మవరం డివిజన్‌లోని ఓ డీఈ ఏకంగా సొంత వాహనం వైట్‌బోర్డుతో గవర్నమెంట్ ఆన్ డ్యూటీ పేరుతో తిరుగుతూ అద్దె కోసం బినామీ పేరుతో బిల్లు డ్రా చేస్తున్నారు. ఇలా మైనర్ ఇరిగేషన్‌లో ఈఈలు, డీఈలు అద్దె వాహనాల పేరుతో సొంత వాహనాలకు నిధులు డ్రా చేసుకుంటూ స్వాహా చేస్తున్నారు.


హెచ్చెల్సీ కార్యాలయం

మా దృష్టికొచ్చింది

కొంతమంది ఇంజనీర్లు అద్దె వాహనాలకు తిరగకనే బిల్లులు చేసుకుంటున్నట్లు సమాచారం ఉంది. అటువంటి బిల్లులను నిలుపుదల చేయాలని అధికారులకు సూచించాం. డీఈ, ఈఈలకు వాహన సదుపాయం ఉంది. కచ్చితంగా ఎల్లో బోర్డు ఉండి అద్దె వాహనాలకు మాత్రమే బిల్లులు చెల్లించాలి. వైట్‌బోర్డుతో తిరిగి బిల్లులు చేసుకుంటే కచ్చితంగా విచారణ చేసి, వెనక్కు కట్టిస్తాం. ఇందులో ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు.

- నాగరాజ, జలవనరుల శాఖ జిల్లా ప్రాజెక్టుల సీఈ

- 16 ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూపు
- పునరావాసం కల్పించాలంటున్న గ్రామస్థులు
- ఎన్నికల హామీతో సరిపెడుతున్న పార్టీలు
- ఇదీ ఉల్లికల్లు గ్రామస్థుల కన్నీటి వ్యథ

ఎన్నాళ్లకు ఇస్తారో..?


చాగల్లు ప్రాజెక్టులో ముంపునకు గురైన ఉల్లికల్లు ముఖచిత్రం



ఆ ఊరు ద్వీపంగా మారటానికి, ఆ గ్రామ దీపం ఆరిపోవటానికి ఎంతో సమయం లేదు. ఇప్పటికే మూడు వైపులా నీరు చేరింది. ఆపన్న హస్తం అందక, ప్రభుత దయలేక ఉబికి వచ్చే కన్నీటిని రెప్పలమాటున దాచుకుంటూ వీధులను ముంచుతున్న నీటిలోనే గ్రామస్థులు జీవనం సాగిస్తున్నారు. పదిమంది బాగుకోసం కన్నతల్లిలాంటి పుట్టి పెరిగిన ఊరిని, జీవనాన్ని త్యాగం చేస్తే ఆర్ధతతో అక్కున చేర్చుకోవాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా పూర్తిస్థాయిలో పరిహారం అందడం లేదు. ఉన్నఊరిని వదలేక, వేరే చోట బతకలేక ముంచుతున్న నీటిలోంచి వచ్చే పురుగు పుట్రలతోనే ఆ గ్రామ ప్రజలు సహజీవనం చేస్తున్నారు. ఇన్ని కష్టాల నడుమ కొట్టుమిట్టాడుతున్న ఆ గ్రామమే శింగనమల మండలంలోని ఉల్లికల్లు.


ఉల్లికల్లు గ్రామంలోకి చేరుతున్న నీరు

శింగనమల మార్చి4 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు కోసం పొలాలు, ఇళ్లను త్యాగం చేసిన వారిని ఆదుకునే విషయంలో అధికారులు ప్రజా ప్రతినిధులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ముంపు ముంగిట ఉన్నవారి కన్నీళ్లు తుడిచేందుకు నింబంధనలు అడ్డు వస్తున్నాయని చెబుతూ 16 ఏళ్లు గడిపేశారు. ప్రతి 5 ఏళ్లకు ప్రజాప్రతినిధులు మారుతున్నారే తప్ప తమ బతుకుల్లో మార్పు రావడంలేదని చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామం ఉల్లికల్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపప్పూరు మండలం చాగల్లు వద్ద 2009లో ప్రాజెక్టు నిర్మించారు. శింగనమల మండలంలోని ఉల్లికల్లు గ్రామ ముంపునకు గురి అవుతుందని నివేదికలో పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సమీపంలో ఉండటంతో ఊట కారణంగా గ్రామం నివాస యోగ్యం కాదని తేల్చారు. అక్కడి భూములు వ్యవసాయానికి పనికిరావని గుర్తించారు. అయితే ఇప్పటి వరకు ఏ ఒక్కరికి పరిహారం అందించలేదు. పునరావాసం కల్పించలేదు.

నిబంధనల పేరిట జాప్యం

చాగల్లు ప్రాజెక్టును 1.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. పూర్తి నిల్వ సామర్థ్యం (ఎఫ్ఆర్ఎల్) ఉన్న సమయంలో ఉల్లికల్లులో 66 ఇళ్లు ముంపులోకి వెళ్లిపోతాయని నివేదికలు చెబుతున్నాయి. పూర్తి నిల్వ సామర్థ్యంపైన 100 మీటర్లు వరకు 218 నివాసాలను గుర్తించారు. నింబంధనల మేరకు అంతవరకు మాత్రమే పరిహారం అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఎఫ్ఆర్ఎల్ 100 మీటర్ల కంటే పైన ఉన్న 560 ఇళ్లకు సైతం పరిహారం ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నా రు. ఊర్లో సగం ఖాళీ అయితే మిగతావారంతా ఎలా ఉండాలంటూ డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు. పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఆగిన ప్రక్రియ

గ్రామంలోని ఇళ్లు, ఇతర నిర్మాణాలు, భూమికి వన్‌టైం సెటిమెంట్ కింద పరిహారం చెల్లించాలని గత ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇళ్లకు రూ.84 కోట్లు, ఇతర నిర్మాణాలకు రూ.66 కోట్లు, భూమికి రూ.70 లక్షలు చెప్పున మెత్తం రూ.151 కోట్లు అవసరమని నివేదికలో పేర్కొన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రక్రియ నిలిచిపోయింది.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత సెప్టెంబరులో శింగనమల తహసీల్దార్ ఉల్లికల్లు పరిహారంపై జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు.

ఎన్నికల్లో హామీ

ఏ ఎన్నికలు వచ్చిన ఉల్లికల్లు పరిహారమే ముఖ్య అజెండాగా ఉంటోంది. తమ పార్టీ గెలిస్తే పరిహారం అందజేస్తామని ఎమ్మెల్యేలుగా గెలిచిన డాక్టర్ సాకే శైలజనాథ్, యామినిబాల, జొన్నలగడ్డ పద్మావతి వరకు ప్రకటించారు. తర్వాత నయాపైస ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రస్తుత ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పరిహారం తీసుకుని వస్తారని గ్రామస్థులు నమ్మకంతో ఉన్నారు.

ఊట నీటిలోనే నివాసం



చాగల్లు ప్రాజెక్టు నీరు మాగ్రామంలోకి చేరడంతో ఊట పెరిగింది. దీంతో ఇళ్లను మూడు అడుగులుపైగా ఎత్తు చేశాం. 18 ఏళ్ల నుంచి పరిహారం కోసం ఎదురుచూస్తున్నాం. అయిన ఇంత వరకు నయా పైస రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిహారం వచ్చేలా చూడాలి. ప్రస్తుతం ఊట నీటిలోనే ఇబ్బందులు పడుతున్నాం.

-రాజాక్

ప్రభుత్వం స్పందించాలి

భారీ వర్షాలు వస్తే గ్రామంలోకి నీరు వస్తాయి. అధికారులు వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప న్యాయం చేయడం లేదు. పొలాలు ముంపునకు గురి అవుతుండటంతో స్థానికం గా ఉపాధి తగిపోతోంది. ఉన్న భూములు ముంపులోకి వెళ్లిపోవడంతో పక్క గ్రామల్లో కూలి పనులకు వెళ్తున్నాం.



-లక్ష్మీనారాయణమ్మ

అభివృద్ధికి దూరం..



ముంపు గ్రామం కింద ఉండడంతో గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు రావడంలేదు. గ్రామంలో మౌలిక సదుపాయలకు ఉన్న పంచాయతీ నిధులు వాడుతున్నాం గ్రామానికి రావడానికి కనీసం సరైన రోడ్డు లేదు. ప్రభుత్వం పరిహారం ఇస్తే...మరో చోట నిర్మాణాలు చేపడతాం.

- సర్పంచ్ అనసూయమ్మ


ఉల్లికల్లు గ్రామంలో రోడ్డు దుస్థితి

న్యాయం చేస్తాం

ఉల్లికల్లు గ్రామానికి ఏళ్లుగా పరిహారం రాకపోవడం సమస్యగా ఉంది. పరిహారం సమస్యను సీఎం దృష్టికి తీసుకుని వెళ్లి బాధితులకు నాయ్యం చేస్తాం. కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులపై శ్రద్ధ చూపుతుండ టంతో ఉల్లికల్లు బాధితులకు న్యాయం జరుగుతుందని నాకు నమ్మకం ఉంది.



-బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే

పంటలే పండటం లేదు: సూర్యనారాయణ



ప్రాజెక్టు దగ్గరగా ఉండటంతో ఏ పంట సాగు చేసినా భూమి జౌకులు పారుతుండటంతో దిగుబడులు రాలేదు. అయితే పరిహారం ఈ ఏడాది, వచ్చే ఏడాది వస్తుందని ఆశతో ఎదురు చూస్తూనే ఉన్నాం. పరిహారం అందక, పంటలు పండక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

అనధికార చిట్టీల నిర్వాహకుల మోసాలు

చీట్టీలు!

- చిట్టీల సొమ్ము, భారీగా రుణాలు తీసుకుని ఉడాయిస్తున్న వైనం
- లబోదిబోమంటున్న బాధితులు
- పోలీసులను ఆశ్రయిస్తున్నా.. జరగని న్యాయం


పోలీసు స్టేషన్ వద్ద బాలకృష్ణ బాధితులు

గుత్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): డబ్బు దర్జా చూపుతారు. విలాస జీవితం గడుపుతున్నట్లు నటిస్తారు. తమకేమీ తక్కువ లేదన్నట్లు అందరినీ నమ్మిస్తారు. చిట్టీలు నిర్వహిస్తున్నామంటున్నారు. చిట్టీ వేసుకుంటే డబ్బు పొదుపు అవుతుందని నమ్మ బలుకుతారు. చిట్టీలు కట్టించుకుంటారు. డబ్బు కూడా వెంటనే ఇస్తారు. అలా.. చిట్టీలను పెంచుకుంటూ పోతారు. పూర్తిగా నమ్మిన చిట్టీలు వేసుకున్న వారిని అప్పులు అడుగుతారు. డబ్బు ఇచ్చాక కొన్ని నెలలపాటు వడ్డీలు ఠంచనుగా చెల్లిస్తారు. దీంతో పూర్తిగా నమ్మిపోయిన రుణదాతలు అడిగినపుడల్లా అప్పు ఇచ్చుకుంటూ పోతారు. ఇలా ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద రుణాలు తీసుకుంటారు. చిట్టీల వేసిన సొమ్ముతోపాటు పెద్దఎత్తున తీసుకున్న రుణాలతో గుట్టుచప్పుడు కాకుండా నిర్వాహకులు ఉడాయిస్తారు. దీంతో బాధితులు షాక్‌కు లోనవుతున్నారు. చిట్టీలు వేసుకున్న డబ్బు, అప్పు ఇచ్చిన సొమ్ము సర్వం కోల్పోతున్నారు. ఇల్లు కట్టుకునేందుకనో, పిల్లల చదువులకనో, పెళ్లిళ్లకనో దాచుకున్న సొమ్మంతా పోగొట్టుకుని దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. న్యాయం చేయమని పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఆధారాలు చూపాలని పోలీసులు అడుగుతుండడంతో దిక్కులు చూస్తున్నారు. ఇలా అనధికార చిట్టీల నిర్వాహకుల బారిన పడి చాలామంది సర్వం కోల్పోతున్నారు. గుత్తిలో ఇలాంటి చిట్టీ మోసాలు వరుసగా వెలుగు చూస్తున్నాయి.

చిట్టీలు వేసి మోసపోయా: ఉమాదేవి, సూరసింగనపల్లి



మా వీధిలో ఉండే మహిళ వద్ద రూ.5లక్షల చిట్టీ వేశా. నా భర్త.. స్నేహితుల వద్ద రూ.10లక్షలు ఆమెకు అప్పు ఇప్పించారు. ఆమె ఫేక్ ప్రాంసరీ నోట్లు ఇచ్చి, మోసం చేసింది. దీంతో ఇతరులకు మేము వడ్డీ కట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ డబ్బుకు ఆమె ఐపీ నోటీసు పంపారు.

ఆశచూపి మోసం చేశారు: ధనలక్ష్మి, గుత్తి ఆర్ఎస్



చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్నా. గుత్తి ఆర్ఎస్‌లో అత్తర్ సాహెబ్ వద్ద రూ.3 లక్షలు చిట్టీ వేసి, మోసపోయా. పోలీసులు న్యాయం చేయాలి.

పోలీసులను ఆశ్రయించినా న్యాయం చేయలేదు: అరీఫా, గుత్తి



పట్టణంలోని కురుంగేరిలో చిట్టీల నిర్వాహకుడు ఐదు నెలల క్రితం మృతి చెందాడు. ఆయన వద్ద రూ.5లక్షలు చిట్టీలను నాతో పాటు నా కుటుంబ సభ్యులు ముగ్గురు వేశాం. ఆయన మృతితో కుటుంబసభ్యులు డబ్బు చెల్లించేది లేదన్నారు. పోలీసులను ఆశ్రయిస్తే ఆధారాలు కావాలన్నారు. దీంతో రూ.15లక్షలు నష్టపోయాం.

అనధికార చిట్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలు: వెంకటేశ్వర్లు, సీఐ

చిట్టీల పేరుతో వ్యాపారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. అనుమతులు లేకుండా చిట్టీలు నిర్వహిస్తే చర్యలు తప్పవు.

గుత్తి రైల్వేస్‌లో రైల్వే రిటైర్డ్ ఉద్యోగి అత్తర్ సాహెబ్ చిట్టీల పేరుతో రూ.కోట్లలో వసూలు చేశాడు. గతేడాది జూలై 10న ఏకంగా రూ.3కోట్లతో కుటుంబ సమేతంగా ఇంటికి తాళాలు వేసి ఉడాయించాడు.

సూరసింగనపల్లికి చెందిన మహిళ చీరల వ్యాపారం చేస్తూ కాలనీలో లక్షల్లో చిట్టీలు నిర్వహించారు. ఒకరికి తెలియకుండా మరొకరితో వడ్డీ ఆశ చూపి లక్షలాది రూపాయలు అప్పుగా తీసుకున్నారు. గతేడాది నవంబరు 23న ఇంటికి తాళాలు వేసి, దేవాలయాలకు వెళ్తున్నామని చెప్పి మాయమైపోయారు. ఆ తరువాత ఐపీ నోటీసు పంపడంతో బాధితులు ఖంగుతిన్నారు. పోలీసులను ఆశ్రయించారు.

గతేడాది అక్టోబరులో పట్టణంలో వంకదారు బాలకృష్ణ వ్యాపారం చేస్తూ అందరితో కలిసి మెలిసి ఉండేవాడు. మార్కెట్‌లోని వ్యాపారులతో పరిచయాలు పెంచుకున్నాడు. చిట్టీలు వేశాడు. ఒక్కసారిగా కుటుంబసమేతంగా రూ.4కోట్లతో ఉడాయించాడని బాధితులు.. పోలీసులను ఆశ్రయించారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కల్తీలపై కఠిన చర్యలు

ఆహార భద్రతాధికారి తస్లీం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో కల్తీ చేసినా, అపరిశుభ్రత కనిపించినా, నాణ్యత లోపించినా శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు ఆహార భద్రతాధికారి తస్లీం. ఇందులో ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదంటున్న ఆమెతో ప్రత్యేక ఇంటర్వ్యూ...



ప్రశ్న: జిల్లాలో తనిఖీలు ఎలా సాగుతున్నాయి..?

జవాబు: రోజూ జిల్లాలో ఏదో ఒక ప్రాంతాన్ని ఎంచుకుని, తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించని ఆయా రెస్టారెంట్లు, హోటల్ సముదాయాలకు అక్కడికక్కడే నోటీసులు జారీ చేస్తున్నాం. సమస్య తీవ్రంగా ఉంటే శాంపిళ్లు సేకరించి, ల్యాబ్‌కు పంపుతున్నాం.

ప్రశ్న: హోటళ్ల ఏర్పాటు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారా..?

జవాబు: హోటల్, రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవాలనుకుంటే తప్పనిసరిగా ఫారం-బితో లైసెన్సులు పొందాలి. ఇదే విషయాన్ని ప్రతి తనిఖీలో సూచిస్తున్నాం. చాలావాటికి లైసెన్సులు లేవు. లైసెన్సుతో పాటు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. అలాంటి వారు మాత్రమే హోటల్, రెస్టారెంట్ నిర్వహించాల్సి ఉంటుంది.

ప్రశ్న: హోటళ్లు, రెస్టారెంట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారా..?

జవాబు: నెలరోజుల క్రితం అపరిశుభ్రత, కల్తీలు, నాణ్యత ప్రమాణాలు పాటించని 11 హోటల్ సముదాయాలపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం. అన్నింటికీ హెచ్చరికలు జారీ చేశాం.

ప్రశ్న: సీజింగ్, ఫైన్ అథారిటీపై ఏవైనా ఆదేశాలు అందాయా..?

జవాబు: ఆహార భద్రత శాఖకు కేవలం నోటీసులు, హెచ్చరికలు, శాంపిళ్ల సేకరణకు మాత్రమే అనుమతులున్నాయి. కొంతమంది నిర్వాహకులకు ఎన్నిసార్లు చెప్పినా మార్పు కనిపించడం లేదు. సీజింగ్, ఫైన్ అథారిటీ అప్రూవల్‌పై ఉన్నతాధికారులకు విన్నవించాం. ఆదేశాలు అందితే మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: గుత్తిలోని ఓ ధాబాలో ఘటనపై చర్యలు తీసుకున్నారా..?

జవాబు: గత సంవత్సరంలో ఆ ధాబాలో జరుగుతున్న కల్తీలు, అపరిశుభ్రతపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా... దానిని మాకు బదిలీ చేశారు. అందులో భాగంగా ధాబాలో తనిఖీకి వెళ్లా. లైసెన్సు, రిజిస్ట్రేషన్ లేకపోవడాన్ని గుర్తించా. అపరిశుభ్రత, తినుబండారాల్లో నాణ్యతాలోపం కొట్టొచ్చినట్లు కనిపించడంతో జిల్లా కలెక్టర్‌కు ఫైల్ పంపా. అనంతరం సీజ్ చేశారు.

ప్రశ్న: కల్తీరాయుళ్లకు ఏం చెప్పదలచుకున్నారు..?

జవాబు: ప్రజలకందించే ఆహార పదార్థాల్లో కల్తీ చేసినా, అపరిశుభ్రత కనిపించినా, నాణ్యత లోపించినా శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవు. ఇప్పటికే పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. మార్పు రాకపోతే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నా.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

కస్తూరి శివరావు (జయంతి)



తెలుగు సినీ రంగంలో తొలితరం కామెడీ నటులలో పేరొందిన కస్తూరి శివరావు 1913 మార్చి 6న కాకినాడలో జన్మించారు. నటుడిగా, కమెడియన్‌గా, నేపథ్య గాయకుడిగా, నిర్మాత, దర్శకుడిగా రాణించారు. మూకీ సినిమాలకు వ్యాఖ్యానం చెప్పేవారిగా కెరీర్ ప్రారంభించి టాకీ సినిమాలలో సత్తా చాటుకున్నారు. స్వర్గసీమ, గుణసుందరి సినిమాలు ఎంతో పేరుతెచ్చాయి. రేలంగి, రమణారెడ్డి, రాజబాబులకంటే ముందుతరం నటుడు. తనదైన మేనరిజం, డైలాగ్‌తో గుర్తింపు పొందారు. అవసాన దశలో పేదరికం అనుభవించి అనామకుడిగా మృతి చెందడం దురదృష్టకరం. 1966 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

పెండ్యాల నాగేశ్వరరావు (జయంతి)



ఇంటిపేరుతోనే గుర్తింపు పొందిన పెండ్యాల నాగేశ్వరరావు 1917 మార్చి 6న కృష్ణా జిల్లా ఒణకూరులో జన్మించారు. తెలుగు చిత్రాలకు దొరికిన అద్భుత సంగీత దర్శకులలో ఒకరు. తెలుగు సినిమా సంగీతాన్ని గగనదిశకు తీసుకెళ్లి తారాపథంలో నిలబెట్టి ఆచంద్రతారార్కం ఆ మధుర సంగీతాన్ని వింటూ పరవశిస్తూ పాడుకునేలా చేసిన ఘనత సంగీత స్మామ్రాట్ పెండ్యాలగారికే దక్కుతుంది. ఆయన వేల పాటలలో తెలుగుతనం ఉట్టిపడుతుంది. కెరీర్ ప్రారంభంలో సహాయ సంగీత దర్శకుడిగా పనిచేశారు. సన్నివేశాన్ని అర్థం చేసుకుని అందుకు తగినట్టుగా ట్యూన్ వచ్చేవరకూ గాయనీ గాయకులచేత పాడించడం ఆయన ప్రత్యేకత. 1984 ఆగస్టు 31న కన్నుమూశారు.

కృష్ణకుమారి (జయంతి)



పాతతరం సినిమా కథానాయిక కృష్ణకుమారి 1933 మార్చి 6న పశ్చిమబెంగాల్ రాష్ట్రం గౌహతిలో జన్మించారు. షావుకారు జానకి ఈమెకు పెద్దక్క. వేదాంతం జగన్నాథశర్మ వద్ద శాస్త్రీయసంగీతం నేర్చుకున్నారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 25 సంవత్సరాలకుపైగా 150కుపైగా సినిమాలలో నటించారు. అలనాటి హీరోలు ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణంరాజు, జగ్గయ్య, హరనాథ్ తదితర వారితో పలు సినిమాలలో నటించారు. ప్రత్యేకించి కాంతారావుతో 28 జానపద చిత్రాల్లో నటించారు. మూడు జాతీయ, నంది పురస్కారాలు అందుకున్నారు. 2018 జనవరి 24న కన్నుమూశారు.

గాబ్రియెల్ గార్సియా మార్క్వెజ్ (జయంతి)



నోబెల్ పురస్కార గ్రహీత గాబ్రియెల్ గార్సియా మార్క్వెజ్ 1927 మార్చి 6న జన్మించారు. కొలంబియా దేశానికి చెందిన ఆయన నవలా రచయిత, చిన్నకథల రచయితగా, స్క్రీన్‌రైటర్‌గా, జర్నలిస్టుగా పేరొందారు. కటువుగా ఉండే విషయాన్నయినా ప్రేమగా చెప్పాలంటారు. ప్రపంచ సాహిత్యానికి వెలకట్టలేని ఎన్నో సాహిత్యరచనలు అందించిన ఆయన 'మార్మిక వాస్తవవాదం' పేరిట సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. విమర్శకులతోపాటు సామాన్య పాఠకుల మన్ననలు పొందారు. కొలంబియా దేశ అధ్యక్షుడు ప్రశంసలు అందుకున్నారు. 1982లో నోబెల్ పురస్కారం, ఇతర గౌరవాలు అందుకున్నారు. 2014 ఏప్రిల్ 17న కన్నుమూశారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకుల ప్రదర్శన

బెంగళూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జరిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. బుధవారం బెంగళూరులోని బీబీఎంపీ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను విడుదల చేశారు. 26వ తేదీన ఢిల్లీలో వందలాదిమంది కళాకారులచేత ధూందాం నిర్వహిస్తామన్నారు. పార్లమెంటులో అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షుల మద్దతు కోరుతామన్నారు. కార్యక్రమంలో సమితి జాతీయ సలహాదారులు ఆళ్ల రామకృష్ణ, కర్ణాటక నాయకుడు, న్యాయవాది ఎం. సుబ్బరాయుడు, ఎంసీ శ్రీనివాస్, శాంతాజయరాం, చన్నకేశవ్, ఈశ్వరయ్య, దీపక్ పాల్గొన్నారు.

ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

బళ్లారిరూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని చేళగుర్కి, సిడిగినమల, రూపనగుడి, కారేకల్ తదితర ప్రాంతాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుకు జ్యోతి ఫౌండేషన్ అధినేత జోళదరాసి తిమ్మప్ప ఆధ్వర్యంలో ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. తిమ్మప్ప మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. గత సంవత్సరం కన్నా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.



విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేసిన జ్యోతి ఫౌండేషన్ అధినేత తిమ్మప్ప

యూజీడీ పనులతో ట్రాఫిక్‌కు అంతరాయం



పట్టణంలో జరుగుతున్న యూజీడీ పనులు

చింతామణి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరిగా పేరొందిన చింతామణిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్) విధానం అమలు చేసేందుకు నిర్మాణ పనులు చేపట్టారు. నిత్యం రద్దీగా ఉండే పాలిటెక్నిక్ రోడ్డు వన్‌వేగా ఉన్నప్పటికీ పలు కారణాలతో టూవేగా మారింది. ఇక పాలిటెక్నిక్ మెయిన్‌రోడ్డు పశ్చిమభాగం కేఆర్ లే అవుట్ రోడ్డులో యూజీడీ పనులు ప్రారంభించడంతో ఈ మార్గంలోని వాహనాలను మరొక మార్గం ద్వారా మళ్లించారు. కిష్కింధ రోడ్డు ద్వారా రాకపోకలకు అనుమతి ఇచ్చారు. అయితే రోడ్డుకు ఇరువైపులా ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు పార్కింగ్ చేసి ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో పట్టణ పోలీసులు చొరవ చూపలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని 234 జాతీయ రహదారిపై ఎంజీ రోడ్డు, చేళూరు సర్కిల్ నుంచి బాగేపల్లి, చిక్కబళ్లాపుర వైపు ప్రయాణించే అన్ని వాహనాలు చేళూరు సర్కిల్, కేఎస్ఆర్టీసీ బస్టాండ్, బెంగళూరు సర్కిల్, పాత సివిల్ బస్టాండ్ రోడ్డు, మారుతి సర్కిల్, కేఆర్ లే అవుట్ మీదుగా జాతీయ రహదారిపై వెళ్లేలా మళ్లించారు. కాగా కొన్ని చోట్ల ట్రాఫిక్ అంతరాయంతో ఇబ్బంది పడుతున్న వాహనచోదకులకు వీలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



పాలిటెక్నిక్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఇలా...

డప్పు కళాకారులను ఆదుకోవాలి



డప్పు కళాకారుల బృందం ఇలా...

బాగేపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో డప్పు శబ్దం వినబడితే ఏదో కొత్త విషయం తెలిసేది. దేవతల ఊరేగింపులు, రాజకీయ నాయకుల మెరవణి, ఇంకా మృతి చెందిన వ్యక్తిని ఊరేగించినప్పుడు కూడా డప్పు వాయిస్తుంటారు. గ్రామంలో ఏదైనా ఒక అంశాన్ని పంచాయతీవారు ప్రకటించాలంటే డప్పు కొట్టేవారిచేత తెలియచేసేవారు. పల్లె లేదా పట్టణం ఏదైనా వినండహో... అంటూ డప్పుకొట్టేవారు సమాచారం తెలిపేవారు. డప్పు వాయించేవారిలో దళితులే అధికం. కాలనీలలో నివసించే దళితులు తమ కుల సంప్రదాయాన్ని పాటిస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రామం లేదా పట్టణంలో పన్నులు చెల్లించడం, ప్రముఖులు ఎవరైనా విచ్చేస్తే డప్పు కళాకారులు ఊరేగింపులు చేయడం సామాన్యం. శుభ కార్యక్రమాలలో డప్పు శబ్దం వినబడితే చిన్నా పెద్ద ఎవరైనా సరే స్టెప్పులు వేయాల్సిందే అంతటి లయబద్ధంగా డప్పు వాయిస్తారు. డప్పు వాయిద్యంతోనే జీవనం సాగించే జానపదులు ఎంతోమంది ఉన్నారు. గ్రామదేవతలు మారమ్మ, సప్పలమ్మ, గంగమ్మ, చైడమ్మ దేవిల ఊరేగింపులలోనూ డప్పు కళాకారులు పాల్గొంటారు. అలాగే మొహరం పండుగ పీర్ల ఊరేగింపులోనూ ఉంటారు. ఇలా అన్ని వర్గాల కార్యక్రమాలలో పాల్గొనే డప్పుకళాకారులకు సరైన మౌలిక సదుపాయాలు అందడం లేదని పలువురు వాపోతున్నారు. తమ వృత్తిని గుర్తించి ప్రభుత్వం తగిన సౌలభ్యాలు కల్పించాలని, రుణ సదుపాయం కల్పించాలని, నరేగా పథకాలలో అవకాశం ఇవ్వాలని రాష్ట్ర శ్మశాన కార్మికులు, డప్పు కళాకారులసంఘం జిల్లా సంచాలకులు కె మునియప్ప డిమాండ్ చేశారు.

గంగమ్మ ఆలయ ముఖద్వారం ప్రారంభం



గంగమ్మకు విశేష అలంకరణ



కార్యక్రమంలో పాల్గొన్న స్వామీజీలు తదితరులు

చేళూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని నల్లగుట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల పురాతన కొండికొండ గంగమ్మ దేవస్థానానికి నూతనంగా ఏర్పాటైన ముఖద్వారాన్ని బుధవారం లాంచనంగా ప్రారంభించారు. ఉదయం 11 గంటలకు ఇమ్మడి సిద్దరామేశ్వర స్వామిజీ, బాలకృష్ణ గురూజీ, అవధూత వినయ్ గురూజీలు పాల్గొని విశేషపూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. స్వామిజీలు తమ ఆధ్యాత్మిక ప్రసంగాలలో ధర్మో రక్షతి రక్షితః అనే నినాదాన్ని ప్రస్తావిస్తూ భక్తి భావంతో అమ్మవారిని నమ్ముకుంటే కాపాడుతుందనే విశ్వాసం ఉందన్నారు. ఆలయంపై హెలికేప్టర్ ద్వారా పుష్పవృష్టి కురిపించారు. కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన స్థానిక నాయకుడు రామాంజనేయులు చొరవను అభినందించారు. పాతపాలెంనుంచి పోలీసు బందోబస్తు కల్పించారు.

ఇతరులకు క్షౌరవృత్తి అనుమతులు ఇవ్వరాదు



కార్మికశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శిడ్లఘట్ట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా సవితా సమాజానికి చెందినవారు కులవృత్తి అయిన క్షౌరవృత్తిని కొనసాగిస్తున్నారని అయితే ఇతర రాష్ట్రాల పెట్టుబడిదారులకు, ఇతర మతాల వారికి అనుమతులు ఇవ్వడం సరికాదని కార్మిక శాఖ అధికారులకు విన్నవించారు. తాలూకా సవితా సమాజ పదాధికారులు బుధవారం వినతిపత్రం అందజేశారు. పుట్టినప్పటి నుంచి కన్ను మూసేవరకు క్షౌరకుల సేవ అవసరం ఉందన్నారు. ప్రస్తుతం క్షౌరవృత్తిపై ఆధారపడినవారు జీవనోపాధికి ఆటంకం నెలకొందని వాపోయారు. అసలు సిలైన క్షౌరవృత్తిదారులకు న్యాయం చేయాలన్నారు. సవితా సమాజం పదాధికారులు లియో లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైరైన వారికి రూ.2లక్షలు మంజూరు చేయండి

» మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల డిమాండ్

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసి రిటైరైన వారికి రూ.2లక్షల ప్రావిడెంట్ ఫండ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో బుధవారం ఫ్రీడంపార్కులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటైన నిరసనలో వేలాదిమంది మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు. గతంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. వివిధ జిల్లాలనుంచి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్లకార్డులు ప్రదర్శించి తమకు న్యాయం చేయాలని కోరారు.



ఫ్రీడంపార్కులో నిరసన

బర్డ్‌ఫ్లూ నిర్ధారణకు 6 పరీక్షా కేంద్రాల ఏర్పాటు



బళ్లారి, సిరుగుప్ప తాలూకాల్లో ఏర్పాటు చేసిన బర్డ్‌ఫ్లూ పరీక్షా కేంద్రాలు

బళ్లారి గాంధీనగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్‌ఫ్లూ కారణంగా ఇప్పటికే వేలాది కోళ్లు మృత్యువాత పడిన నేపథ్యంలో పశుసంవర్ధశాఖ శాఖ 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. బళ్ళారి, సిరుగుప్ప తాలూకా పరిధిలో వీటిని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. వీటిలో బళ్లారి తాలూకాలో ఎత్తినబూదిహాల్ క్రాస్, సింధువాళ, పరమదేవనహళ్ళి, సిరుగుప్ప తాలూకాలో మాటసూగూరు, వట్టు మురువాణి, ఇటిగినహాల్ ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ హనుమంత నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రి మహదేవప్పను బర్తరఫ్ చేయాలి



అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

రాయచూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న మంత్రి హెచ్‌సీ మహదేవప్పను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుల డిమాండ్ చేశారు. న్యాయమూర్తి నాగమోహన్‌దాస్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల అమలుపై మంత్రి చేసిన వ్యాఖ్యలు మాదిగలకు తీరని అన్యాయం చేసేవిధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ ఆ సంఘం నాయకులు బుధవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేపట్టారు.


లగేజీ వాహనాల్లో జనాలను తరలించవద్దు



డ్రైవర్లు, యజమానులకు అవగాహన కల్పిస్తున్న 112 విభాగం పోలీసులు

బళ్లారి గాంధీనగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): లగేజీ వాహనాల్లో ప్రయాణికులను తీసుకెళ్లరాదని, డ్రైవర్లు, యజమానులకు 112 విభాగం పోలీసులు హెచ్చరించారు. అనుభవం, లైసెన్సులేని వారు ఎక్కువగా లగేజీ వాహనాలు నడుపుతున్న కారణంగానే ప్రమాదలు జరుగుతున్నాయని అన్నారు. అలా జరగకుండా వాహనాల యజమానులు బాధ్యతగా నడుపుకోవాలని సూచించారు. బళ్లారి తాలూకా పరిధిలోని మోకా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కువగా లగేజీ వాహనాల్లో కూలీలు తీసుకెళుతున్నారని పోలీసులు గుర్తించారు. ఓవర్ స్పీడ్ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని డ్రైవర్లకు పోలీసులు హెచ్చరించారు.

నేటి నుంచి నవోదయ రీగల్-2025



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి

రాయచూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని నవోదయ విద్యా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే రీగల్ కార్యక్రమాలు గురువారం నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఆర్ రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని కళాశాల వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కళాశాలకు యూజీసీ నుంచి స్వయంప్రతిపత్తి గుర్తింపు లభించిందన్నారు. తొలి రోజు కార్యక్రమాన్ని గురువారం రాత్రి కర్ణాటక వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ వైసీ యోగానంద రెడ్డి ప్రారంభిస్తారన్నారు. అనంతరం విద్యార్థుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 7న హృద్రోగ నిపుణుడు డాక్టర్ ఆనంద్ ఎం రావ్ ప్రారంభిస్తారన్నారు. 8వ తేదీన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తామని వెల్లడించారు.

23 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

ముళబాగిలు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జాతీయ రహదారి నంగలి-ముళబాగిలు మధ్య గంజాయి సాగిస్తున్నారనే సమాచారంతో పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. అల్లాళసంద్ర గేట్ సమీపాన ఆటోలో తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులనుంచి సుమారు 23 లక్షల విలువైన 23 కేజీల 805 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మాలూరు తాలూకా హాళదేనహళ్ళి గ్రామ పంచాయతీ వెంకటరాజనహళ్ళికి చెందిన వీఎం కృష్ణమూర్తి (44), మాలూరు తాలూకా కడదనహళ్ళి గ్రామానికి చెందిన మనోహర్ (26)గా గుర్తించారు. వీరు కోలారు, ముళబాగిలు ప్రాంతాలలో గంజాయిని విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్టు తెలుస్తోంది. జిల్లా ఎస్పీ బి నిఖిల్, ఏఎస్పీ రవిశంకర్, జగదీశ్, డీఎస్పీ నందకుమార్ మార్గదర్శకంలో సీఐ కేజీ సతీశ్ నేతృత్వంలో కార్యాచరణ సాగింది. నిందితులను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కార్యాచరణలో పాల్గొన్న సిబ్బందిని ఎస్పీ నిఖిల్ అభినందించారు.

సైన్సును సద్వినియోగం చేసుకోవాలి



ప్రదర్శనలో వెంకటేశప్ప తదితరులు

బాగేపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జీవితంలో సైన్సును సద్వినియోగం చేసుకోవాలని మూఢనమ్మకాలు వీడాలని తాలూకా బీఈఓ ఎస్ వెంకటేశప్ప పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కొండరెడ్డిపల్లి పాఠశాలలో ఏర్పాటైన జాతీయ గణిత, సైన్స్ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. చుట్టుపక్కల వస్తువులైన పేపర్, ప్లాస్టిక్ బంతులతో ప్రయోగాలు రూపొందించారు. మానవ వనరుల సమన్వయ అధికారి వెంకటరామ్ మాట్లాడుతూ గణితరంగంలో ఆర్యభట్ట, బ్రహ్మగుప్త, వరాహమిహిరుడు, భాస్కర్, శ్రీరామానుజన్ సహా పలు రంగాలలో రాణించారన్నారు. కార్యక్రమంలో మహబూబ్, ఒబెదుల్ల, కుశల్‌కుమార్, ఘంటంవారిపల్లి హైస్కూల్ టీచర్ ఎల్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఆఫీస్ సౌకర్యాలు కల్పించండి

బెంగళూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ఆఫీస్ సౌకర్యాలకు డిమాండ్ పెరుగుతోందని ఐ స్ప్రౌట్ సంస్థ సీఈఓ సుందరి పతిబండ్ల అభిప్రాయపడ్డారు. దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాలలో బెంగళూరు ఉందని ఇక్కడ వందలాది ఫార్చ్యూన్ కంపెనీలు ఉన్నాయన్నారు. బుధవారం ప్రెస్టేజ్ సలేహ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించినట్లు ఆమె ప్రకటించారు. సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ పరిధిలోని ఇన్‌ఫ్యాంట్రీ రోడ్డులో ఆఫీసులకు అందుబాటులో ఉండేలా తీర్చామన్నారు. కోఫౌండర్ శ్రీనివాస్ తీర్థలతోపాటు పలువురు పాల్గొన్నారు.


లారీని ఢీకొన్న కారు

● మాజీ కౌన్సిలర్ సహా ముగ్గురి మృతి

చెన్నై, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ధర్మపురి సమీపం జాతీయ రహదారిలో బుధవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో హోసూరు అన్నాడీఎంకే మాజీ కౌన్సిలర్ సహా ముగ్గురు మృతిచెందారు. ఈ ముగ్గురూ కారులో పర్యాటక ప్రాంతం హొగెనేకల్ వెళ్ళి స్వస్థలానికి తిరిగివస్తూ మృత్యువాత పడ్డారు. కృష్ణగిరి జిల్లా హోసూరు అలసనత్తం ప్రాంతానికి చెందిన అన్నాడీఎంకే మాజీ కౌన్సిలర్ మునికృష్ణన్ (50), తన స్నేహితులు శీనివాస్ (47), బసవరాజ్ (38), మంజునాథ్ (47), చంద్రప్రభ (50)తో కలిసి కారులో హొగెనేకల్‌కు విహారయాత్రగా వెళ్ళి తిరిగి స్వస్థలానికి బయలుదేరారు. బుధవారం ఉదయం ధర్మపురి సమీపం మహేంద్రమంగళం సమీపం జిట్టాండహళ్ళి కొత్త జాతీయ రహదారిలో ఆ కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఆ రోడ్డు పక్కనే నిలిచి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడిపిన మునికృష్ణన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ సమాచారం తెలుసుకుని మహేంద్రమంగళం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారు శిథిలాల మధ్య తీవ్రగాయాలతో ఉన్న నలుగురిని అంబులెన్స్‌లో పాలకోడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. ఆ ఆసుపత్రిలో చేరిన కాసేపటికి బసవరాజ్, శీనివాస్ మృతిచెందారు. మంజునాథ్, చంద్రప్రభ ఆస్పత్రిలో చికిత్స పొందుకుంటున్నారు.



ప్రమాద స్థలంలో గుమికూడిన జనం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1605.79	1,586.18
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,432	885
నీటి నిల్వ (టీఎంసీలు)	29.99	8.12

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తాలూకాలో రూ.59 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు బుధవారం భూమి పూజ చేశారు. పట్టణంలోని 14, 18 వార్డుల్లో పనులను ఆయన ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని ఇంజనీర్లకు సూచించారు. నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్, పవన్‌కుమార్ దేశాయ్, గణేష్, ఇంజనీర్ అనిల్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



చలివేంద్రాన్ని ప్రారంభించిన బసమ్మ, చంద్రప్పను సన్మానిస్తున్న యర్రిస్వామి

కంప్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణం రూపనగుడి యర్రిస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు బసమ్మ, చంద్రప్ప కోరారు. బుధవారం వారు చలివేంద్రాన్ని ప్రారంభించారు. బసమ్మ మాట్లాడుతూ నీటిని వృథా చేయరాదని, సీతారామాంజనేయస్వామి రథోత్సవం సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రథోత్సవానికి వచ్చే భక్తులు నీటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రామలింగప్ప, కృష్ణప్ప, గోపి, సొసైటీ అధ్యక్షులు యర్రిస్వామి, ఆంజనేయులు, హాలప్ప, గ్యాంగ్ హనుమంతు, రామదుర్గ, సునీల్, దేవేంద్రప్ప, ముఖ్య అధికారి తీర్థప్రసాద్, శాంతమూర్తి పాల్గొన్నారు.

నేతి సీతారామయ్య శర్మ మృతి



బళ్లారి సిటీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ వాస్తు, జోతిష్య నిపుణులు, సీతారామ ఆశ్రమ ట్రస్ట్ అధ్యక్షుడు నేతి సీతారామయ్య శర్మ సిద్ధాంతి(73) మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని రామనగర్‌లోని హవాంబావి 2వ క్రాస్‌లో ఉన్న ఆయన నివాసంలో ప్రజల దర్శనార్థం ఉంచారు. ఆయన జూలై 2 1952న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా హనుమంతపురం అగ్రహార(గడ్డిపాడు) గ్రామంలో నేతి లక్ష్మీ నరసింహరావు,నేతి అలిమేలు మంగతయార్ దంపతులకు జన్మించారు. 1978లో ఆయన ఆంధ్రప్రదేశ్ నుంచి కర్ణాటకాలోని బళ్లారి జిల్లా హొసపేట తాలూకాలోని కృష్ణానగర్ క్యాంప్(దేవసముద్రక్యాంప్) కోదండరామ ఆలయంలో పూజారిగా చేరారు. ఆయన సీతారామ ఆశ్రమ ట్రస్టును స్థాపించి అనేక దైవిక కార్యాలు చేశారు. ఆయన వందలాది మంది విద్యార్థులకు వేదాలను అభ్యసించేందుకు సహకారం అందించారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం ఉదయం 8 గంటలకు జరుగుతాయి.

గుడ్ల పరిశ్రమలో గందరగోళం..!

- భారీగా తగ్గిన గుడ్ల ధరలు ● ఆందోళనలో వ్యాపారులు
- గుడ్లకోళ్లకు రాని బర్డ్‌ఫ్లూ .. అయినా కొనేవారు కరువు
- సరిహద్దుల వద్ద చెక్‌పోస్టుల ఏర్పాటు



కొనేవారు లేక వెలవెలబోతున్న గుడ్ల దుకాణం

బళ్లారి సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ దెబ్బకు గుడ్డు పరిశ్రమ దెబ్బతింటోంది. కోళ్లఫారాల్లో రెండు రకాల కోళ్లను పెంచుతారు. ఒకటి మాంసం కోసం, మరొకటి గుడ్ల ఉత్పత్తి కోసం. గుడ్లు పెట్టే కోళ్ల జీవితకాలం రెండు సంవత్సరాలు. ఈ కాలంలో ఒక్కో కోడి 350-400 గుడ్లు పెడతాయి. ఈ కోళ్లను చాలా జాగ్రత్తగా మందులతో చూసుకుంటారు. ఈ గుడ్లు పెట్టే కోళ్లు వ్యాధుల బారిన పడే అవకాశం తక్కువ. మాంసం కోసం బ్రాయిలర్ కోళ్లను పెంచుతారు. వాటి జీవితకాలం 38 నుంచి 40రోజులు. వాటికి పెద్ద వైద్య చికిత్స లేదా భద్రతా చర్యలు ఉండవు. అవి త్వరగా వ్యాధులకు గురవుతాయి. బళ్లారిలోని కప్పగల్‌లో చనిపోయిన కోళ్లన్నీ బ్రాయలర్ కోళ్లే. బళ్లారి శివార్లలోని కణేకల్ రోడ్డు సమీపంలో 95,000 గుడ్లు పెట్టే కోళ్లు ఉన్న ఫారంలో బర్డ్‌ఫ్లూ కేసు ఏదీ నమోదుకాలేదు.

తగ్గిన గుడ్డు ధర

బర్డ్‌ఫ్లూ భయంతో గుడ్డు ధర తగ్గింది. కేవలం రెండు నెలల్లో గుడ్డు ధర రూ.2 తగ్గాయి. గత డిసెంబరులో రూ.5.80 ఉన్న ధర ప్రస్తుతం రూ.3.80కి తగ్గిందని అని కోళ్లఫారం యజమానులు శ్రీధర్, సుమన్ తెలిపారు. దేశంలో మొట్టమొదట బర్డ్‌ఫ్లూ 2002లో కనిపించింది. అప్పటి నుంచి మూడు నుంచి నాలుగు తీవ్రమైన సమస్యలు మాత్రమే ఉన్నాయి. ఈ సమస్య ప్రతి సంవత్సరం కనిపిస్తుంది. కానీ తీవ్రత తక్కువగా ఉంటుంది. ఈ సంవత్సరం తీవ్రత ఎక్కువగా ఉందని కోళ్లఫాం యజమానులు చెబుతున్నారు. మాంసం కోడి పరిశ్రమ కంటే గుడ్డు కోడి పరిశ్రమ పెద్దది. అక్కడ మరింత జాగ్రత్తలు తీసుకుంటారు.

గుడ్ల కోడిలో బర్డ్‌ఫ్లూ లేదు

- హనుమంత నాయక్ కర్చారి, డిప్యూటీడైరెక్టర్, పశుసంవర్ధక శాఖ

బర్డ్‌ఫ్లూ సోకిన కోడి ఒకటిన్నర రోజుల్లోనే చనిపోతుంది. అవి దుకాణం వద్దకు చేరుకునేలోపే చనిపోతాయి. మాంసం దుకాణంలో కోళ్లు కనిపిస్తున్నాయంటే అవి ఆరోగ్యకరమైన కోళ్లు అని అర్థం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బళ్లారి నుంచి చనిపోయిన కోళ్లనమూనాలను పశుసంవర్ధక శాఖ సిబ్బంది భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యనిమల్ డిసీజెస్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి నివేదిక రావాల్సి ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో నమూనాను పరీక్షించడంలో ఆలస్యం జరుగుతోంది.

ఐదు చెక్‌పోస్టుల ఏర్పాటు



చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న అధికారి

బళ్లారి గాంధీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో పాలనా మండలి అప్రమత్తమైంది. ఇప్పటికే బళ్లారి జిల్లాకు ఆనుకుని ఉన్న అనంతపురం, కర్నూలు జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఆంధ్రా నుంచి కోళ్ళు, మాసం జిల్లా పరిధిలోకి ప్రవేశించకుండా ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుంతకల్లు, అనంతపురం ప్రాంతాల నుంచి కోళ్ల రవాణా వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. పరమదేవనహళ్ళి వద్ద, కర్నూలు నుంచి రాకుండా అటువైపు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది.

కళలను విద్యారంగంలో పంచుకోవాలి

- వైస్‌చాన్స్‌లర్ మునిరాజ్



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్స్‌లర్ మునిరాజ్

బళ్లారి సిటీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విభిన్న సాంస్కృతిక కళలను విద్యారంగంలో పంచుకోవాలని విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మునిరాజు అన్నారు. రాష్ట్రం అనేక కళలకు నిలయమని, వివిధ ప్రాంతాల్లో విభిన్న సాంస్కృతిక సంప్రదాయాలను మనం చూడవచ్చన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు వరమని అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్-నెహ్రూ యువ కేంద్రం, విశ్వవిద్యాలయ విద్యార్థి సంక్షేమ విభాగం సంయుక్తంగా తుమకూరు జిల్లాలో జరగనున్న 5 రోజుల అంతర్ జిల్లా యువజన మార్పిడి కార్యక్రమాన్ని బుధవారం విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సమావేశ భవనంలో ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ 2047 నాటికి దేశంలో 80 శాతం యువత ఉంటారన్నారు. యువత తమ సాంస్కృతిక, విద్యాప్రతిభను మార్పిడి చేసుకోవాలని ఆయన సూచించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ రుద్రేశ్ మాట్లాడుతూ ఉత్తర కర్ణాటక జానపద కళలకు పుట్టినిల్లు అన్నారు. నేటి యువతకు మన దేశీయ కళల గురించి తెలియదని, వాటిని తదుపరి తరానికి అందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. విద్యతో పాటు సాంస్కృతిక విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు నైపుణ్య ఆధారిత విద్య ముఖ్యమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ రాఘవేంద్ర అన్నారు. జానపద కళలను జీవితంలోకి చేర్చాలని ఆయన కోరారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మోంటు పత్తార్ మాట్లాడుతూ తమకూరులో జరిగిన మార్పిడి కార్యక్రమంలో బళ్లారి విశ్వవిద్యాయలం నుంచి 27 మంది విద్యార్థులు, బళ్లారిలో జరిగిన మార్పిడి కార్యక్రమంలో తుమకూరు విశ్వవిద్యాలయం నుంచి 25 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. తదుపరి నాటక ప్రదర్శన కళల విభాగానికి చెందిన డాక్టర్ అన్నాజీ కృష్ణారెడ్డి బృందం సంగీత కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో ప్రొఫెసర్ శశికాంత్ మజాగి, నెహ్రూ యువ కేంద్ర కార్యక్రమ అధికారి రాంరావు బిరాదార్, శశికాంత్ శశిధర్ కెల్లూర్, వివిధ విభాగాల డీన్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధనా విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అనుగుణంగానే సంక్షేమ పథకాలు

కంప్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్యారెంటీ పథకాల ద్వారా ఎంతో మంది ప్రజలకు లబ్ధి చేకూరిందని గ్యారెంటీ పథకం అమలు కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో జిల్లా కృషి శిక్షణ కేంద్రంలో తాలుకా పంచాయతీ అధికారుల పరిశీలన సభలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం శక్తి యోజన, గృహలక్ష్మీ, యువనిధి, అన్నభాగ్యలను అమలు చేసిందన్నారు. ఈ పథకాలు పేద ప్రజలకు అందుతున్నాయా లేదా అని అధికారులు పరిశీలించాలని సూచించారు. అనంతరం ఈవో శ్రీకుమార్ మాట్లాడుతూ 99 శాతం పేదలకు పథకాలు అందుతున్నాయన్నారు. ఇప్పటికే యువనిధి కింద ఉద్యోగాలు కూడా కల్పిస్తున్నామన్నారు. కంప్లి తాలుకాలో 686 మంది నిరుద్యోగులకు రూ.71,59,500 అందాయన్నారు. కంప్లి తాలుకా అంతా 2,753 అంత్యోదయ కార్డులు, బీపీఎల్ 26,080 కార్డులు, ఏపీఎల్ 4,550 కార్డులు మొత్తం 33,380 కార్డులు వున్నాయని తెలిపారు. కేవలం ఆరోగ్యపరంగా క్షీణిస్తున్న వారికి అవసరమైతే కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లన్నగౌడ, గ్యారెంటీ పథకాల సభ్యులు శివరాజ్‌కుమార్, రమేష్, మంజునాథ గౌడ, సిద్దప్ప, వీరభద్రగౌడ, శేఖర్, కరియప్ప, వీరేష్, రాజాబక్షి, లక్ష్మీకాంత్, తిమ్మప్ప, రేణుకమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్యారెంటీ పథకాల పరిశీలన అధ్యక్షుడు శ్రీనివాసరావు

చెట్లకిందే విద్యాబోధన..!

- గదుల కొరతతో ఇబ్బందులు.. ● పట్టించుకోని విద్యాశాఖ



చెట్టుకింద పాఠాలు వింటున్న విద్యార్థులు

కంప్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని ఎమ్మిగనూరు గ్రామంలో తలవారిపేటలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో గదుల కొరతతో విద్యార్థులు చెట్లకిందే ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు 224 మంది విద్యార్థులు ఉండగా, ఐదు గదులు మాత్రమే వున్నాయి. ఇప్పటికే గదుల విషయమై అధికారులకు, గ్రామ పంచాయతీకి వివరించామని హెచ్ఎం తిప్పేస్వామి తెలిపారు. ఎండవేడిమి వుండటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే ప్రభుత్వ పాఠశాలకు నూతన గదులను నిర్మించి సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ధర్నా వద్ద వంటా,వార్పులో పాల్గొన్న కార్మికులు

శ్మశాన కార్మికులకు పింఛన్ అందించాలి

బళ్లారి సిటీ,మార్చి 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర శ్మశాన కార్మికుల సంఘం జిల్లా కమిటీ శ్మశాన కార్మికుల జనాభా గణనను నిర్వహించి, పింఛన్ అమలు చేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు ఆ సంఘం నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించారు. సంస్థ జిల్లాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ కుటుంబ సభ్యుల జనాభా గణనను నిర్వహించి వారి పునరావాసానికి చర్యలు తీసుకోవాలన్నారు. 45 ఏళ్లు పైబడిన కార్మికులందరికీ నెలకు కనీసం రూ.3000 సబ్సిడీ లేదా పింఛన్ అందించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద శ్మశాన గుంతలు తీసి మూసే పనిని అప్పగించాలన్నారు. స్థానిక సంస్థల ద్వారా గుంతలు తవ్వి మూసే కార్మికులకు రూ.4వేలు కనీస వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల ద్వారా శ్మశాన కార్మికులకు అవసరమైన భద్రతా చర్యలు, గుంతలు తవ్వి మూసేయడానికి అవసరమైన పరికరాలను అందించాలని డిమాండ్ చేశారు. శ్మశాన కార్మికుల పిల్లలకు వివాహ సహాయం అందించాలన్నారు. కార్మికులకు 5 ఎకరాల వ్యవసాయ భూమిని అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి ఎ. స్వామి, సండూరు యూనిట్ అధ్యక్షుడు వీరేశ్, సిరుగుప్ప తాలూకా యూనిట్ అధ్యక్షుడు బి.మారుతి పాల్గొన్నారు.

తాగునీరు వృథా..!



ఎస్పీ సర్కిల్ వద్ద పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

బళ్లారి గాంధీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నగరంలో 10 రోజులకు ఒకసారి తాగునీరు లభించే పరిస్థితి నెలకొంది. పరిస్థితి ఇలా ఉంటే నగరంలోని ఎస్పీ సర్కిల్‌లో పైప్‌లైన్ లీకై తాగునీరు వృథాగా పోతోంది. కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. మూడు నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా సిబ్బంది వేతనాల కోసం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్నారు. దీంతో పైప్‌లైన్ మరమ్మతులకు సిబ్బంది రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ప్రధానంగా సిబ్బంది సమస్యను పరిష్కరించి నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కార్పొరేషన్, జిల్లా పాలనా మండలిపై ఉందని ప్రజలు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పిల్లల పోషణ ఎంతో పవిత్రమైనది



తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మహదేవమ్మ

సిరుగుప్ప, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పిల్లల పోషణ ఎంతో పవిత్రమైనదని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మహదేవమ్మ అన్నారు. బుధవారం తాలుకా పంచాయతీ భవనంలో పిల్లలను పోషించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిశు అభివృద్ధి యోజన శాఖ తాలుకా పంచాయతీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆమె మాట్లాడుతూ తాలుకాలో 20 గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమ అమలుకు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పిల్లలను ఆరోగ్యవంతంగా చేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. పిల్లల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో విషయాలను తెలుసుకుని వారిని పౌష్టికంగా పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు.

మాజీ మంత్రికి సన్మానం



మాజీ మంత్రిని సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

బళ్లారిరూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీనగర్ అఖండ కర్ణాటక వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోళదరాసి తిమ్మప్ప నేతృత్వంలో మాజీ మంత్రి శివన్నగౌడ నాయక్‌ను సన్మానించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ సమాజంలోని ప్రతిభావంతులను గుర్తించి సామాజిక, రాజకీయ, ఆర్థిక అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సంఘం ఐకమత్యంతో వుండటంతో మనం కష్టపడి ఏదైనా సాధించవచ్చన్నారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన ఆయనకు శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఉపాధ్యక్షులు పీడీహళ్లి జనార్దన్ నాయక్ జిల్లా అధ్యక్షులు ఎర్రగుడి ముద్దమల్లయ్య, కార్యదర్శి సంగనకల్ విజయ్‌కుమార్, కోశాధికారి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రగుడి వెంకటేష్, బసవరాజు ఉమేష్ భాస్కర్, సత్యనారాయణ, రుద్రప్ప పాల్గొన్నారు.

వెన్నెముక సమస్యలపై అవగాహన



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి

హొస్పేట (విజయనగరం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): వెన్నెముక క్షీణత లక్షణాలు గుర్తించిన వెంటనేవైద్యుడి నుంచి తగిన చికిత్స పొందాలని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ శంకర్ నాయక్ సూచించారు. నగరంలోని తాలుకా ఆరోగ్య కేంద్రం అధికారి కార్యాలయ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వెన్నెముక గాయం, నిర్వహణ శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. మానవ వెన్నెముకలో మెదడు నుంచి మల ద్వారం వరకు మొత్తం 33 నాడులు ఉంటాయన్నారు. మధ్యలో తాడులాగా నడిచే నొప్పిని మనం వెన్నుపాము అంటారన్నారు. ఈ ఎముకల మధ్యలో రెండు ముఖ్యమైన ఇంద్రియ, మెదడు నరాలు ఉంటాయని తెలిపారు. ఇవి మెదడు నుంచి శరీరంలోని అన్ని భాగాలకు సందేశాలను అందించడం, స్వీకరించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. ఈ నరాలకు ప్రమాదవశాత్తు జరిగే ప్రమాదాలు, క్షయవ్యాధి వల్ల వెన్నెముక దెబ్బతిన్నప్పుడు ఒక వ్యక్తి దిగువ శరీరం అన్ని విధాలుగా ఆగిపోతాయన్నారు. విజయనగరం జిల్లాలో ఈ వ్యాధిబారిన పడినరోగులకు ది అసోసియేషన్ ఆఫ్ పీపుల్ విత్ డిసేబిలిటీ చికిత్స అందించి వారికి మెరుగైన భవిష్యత్తు కల్పిస్తుందన్నారు.

హోసూరు జోన్

వేప్పనపల్లి యూనియన్‌లో కలెక్టర్ పర్యటన

హోసూరు(కృష్ణగిరి), మార్చి 5(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా వేపనపల్లి పంచాయతీ యూనియన్ పరిధిలో కలెక్టర్ దినేశ్‌కుమార్ బుధవారం పర్యటించారు. యూనియన్ పరిధిలోని కుందారపల్లి, బిల్లనకుప్పం, మారసంద్రం, కోటిపల్లిలో గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో రూ.1.72కోట్లతో అభివృద్ధి పనులను పరిశీలించారు. కుందారపల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.9.58 లక్షలతో వంట గది, ఇతర నిర్మాణ పనులు, కుందారపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చౌకధరల దుకాణంలో బియ్యం, పప్పులు, వంటనూనె, చక్కెర, నిల్వలను స్వయంగా పరిశీలించి కుటుంబ కార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రామాపురం గ్రామం ఎస్ 5921 కుందారపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల రుణం, నగల రుణం, పంట రుణం సహా పలు రుణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిల్లనకుప్పం పంచాయతీ బండపల్లి గ్రామంలో నాబార్డు ప్రాజెక్టు క్రింద రూ.18 లక్షల 42 వేలతో 30 వేల లీటర్ల సామర్థ్యంలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. బండపల్లి అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల బరువు, ఎత్తు, హాజరు రికార్డు, పిల్లలకు అందిస్తున్న ఆహారంపై ఆరా తీశారు. అనంతరం తిప్పనపల్లి గ్రామంలో మాజీ మంత్రి కరుణానిధి కలల గృహం పథకం క్రింద లబ్ధిదారురాలు రాజమ్మ నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రోగ్రామ్ డైరెక్టర్ కవిత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మలర్విళి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణి, రీజినల్ డెవలప్‌మెంట్ అధికారులు మహేశ్ కుమార్, సిరాజ్ ఉద్దీన్, ఎమ్మెల్యే కళా, అసిస్టెంట్ ఇంజనీర్ మణివణ్ణన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

నీటి కుంటలో పడి విద్యార్థి, ఉపాధ్యాయుడి మృతి



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు(క్రైం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపం ఎలువపల్లి గ్రామంలోని ఒక పొలానికి అనుబంధమైన నీటికుంటలో బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు విద్యార్థి పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే టీచర్ దృష్టికి తెచ్చారు. వెంటనే అక్కడికి వెళ్లి రక్షించే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. మూడో తరగతి విద్యార్థి నితిన్ (8)ను కాపాడేందుకు వెళ్లిన ఉపాధ్యాయుడు శంకర్ రాజా(53) కూడా మృత్యువాత పడ్డారు. ఘటనపై బాగలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విద్యార్థి తల్లిదండ్రులను కృష్ణగిరి జిల్లా కలెక్టర్ ఎస్ దినేశ్ కుమార్ ఓదార్చారు. విద్యార్థి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్ శంకర్, దక్షిణస్వామి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన



ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ గోపినాథ్

హోసూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమ జిల్లా శూలగిరి నార్త్ యూనియన్ కార్యదర్శి నాగేశ్ ఆధ్వర్యంలో డీఎంకే జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై.ప్రకాశ్, కృష్ణగిరి పార్లమెంట్ సభ్యుడు ఎంపీ గోపినాథ్‌లు గ్రామాలలో సందర్శించారు. పీఎస్ తిమ్మసంద్రం, కాటినాయకం దొడ్డి, బేర్కై, ముదుగురికి, నెరిగం, రామందొడ్డి, అత్తిముగం, చెట్టిపల్లి, ఉంగట్టి, బుక్కసాగరం, కమందొడ్డి, పంచాయతీల ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో వచ్చే ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు ఇప్పటినుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఉప కార్యదర్శి మురుగన్, కూటమీ పార్టీ ఇన్‌చార్జ్‌లు, డీఎంకే ఇన్‌చార్జ్‌లు కృష్ణన్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడి అరెస్టు



క్లినిక్‌కు తాళం వేస్తున్న అధికారులు

హోసూరు(క్రైం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హోసూరు పక్కనే ఉన్న కదిరేపల్లి లో మెడికల్ చదవకుండానే ప్రజలకు వైద్యం అందిస్తున్నారనే సమాచారంతో వైద్యబృందం దాడులు నిర్వహించారు. వైద్య అధికారి పరమశివం ఆదేశాలతో జిల్లా డ్రగ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ రాజుగాంధీ, వైద్య బృందం, హడ్కో పోలీసులు కదిరేపల్లిలో తనిఖీలు నిర్వహించారు. తిరుపత్తూరు జిల్లాకు చెందిన విశ్వనాథన్ (51) ఎంఎస్సీ చదివి నాలుగు సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో క్లినిక్ నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. బుక్కసాగరం ప్రాంతంలో ఎలాంటి వైద్య కోర్సు చేయకనే క్లినిక్ నడుపుతున్నందుకు అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. మందులు, మాత్రలు స్వాధీనం చేసుకుని క్లినిక్‌క్ సీల్ వేశారు.